


## 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

### "తస్మై శ్రీ గురవే నమః"

- ఎ.విజయకుమార్, హైదరాబాదు



"శ్రీ గురుభ్యోనమః" అవును గురువు గురించి రాసే ఏ శీర్షిక అయినా గురువుకే ధారపోయాలి. ఇదేమిటి? నేర్చిన ఏ విద్య అయినా గురువుకే ధారపోయాలి అనేది చదువుకి సంస్కారం నేర్పిన సంస్కారం. ఇలాంటి మరెన్నో సంస్కారాలను నిరంతరం ఆచరిస్తున్న ఈ ఆదర్శమూర్తి నియాన్ లైట్ల నీడలో మగ్గే నేటి తరానికి ఓ మార్గదర్శి.

ఎందుకంటే 'యద్యదాచరతి శ్రేష్ఠః తత్త దేవేత్తరో జనః" అన్న గీతా సారాంశాన్ని బలంగా నమ్మిన వ్యక్తి. 2005లో భాగ్యనగరానికి వచ్చిన నేను సంగీతాపేక్షతో గురువుకై రెండు సంవత్సరాలుగా అన్వేషణ సాగిస్తున్న తరుణంలో 2007లో కలిగిన పరిచయం మాది. నేడు ఎంతోమంది తమకున్న సరస్వతి కటాక్షాన్ని లక్ష్మి కటాక్షంగా రూపాన్తరించేస్తున్న క్రమంలో సంగీత ప్రచారమే తన జీవిత ఆశయంగా 'సప్త స్వరాల'నే తమ జీవిత పరమపద సోపానాలుగా మలుచుకున్న ఈయన సంగీతానికి నిలువెత్తు స్వరూపమే అంటాను నేను.

అది 2007 వ సంవత్సరం. అప్పటికే నేను భాగ్యనగరం చేరి రెండు సంవత్సరాలపై చిలుకు అయింది. కాని నా అంచనాల మేరకు ఓ గురువుకానీ, ఓ సంగీత సంస్థ గానీ నాకు తటస్థించలేదు. రోజూ ఉదయం 8.30కి ఆఫీసుకి వెళ్ళడం తిరిగి రాత్రి 11.30కి ఇంటికి చేరుకోవడం ఇదే నా దినచర్య. నా జీవితంలో ఎంతో ప్రధానంగా ఫీల్ అయ్యే సంగీతాన్ని మిస్ అవుతున్నానని బాధపడని క్షణం లేదు. కాని ఓ రోజు ఆదివారం 7.30 కి ఆఫీసు ముఖం చూడాల్సి వచ్చింది. ఆదివారం కూడా పనేమిటిరా బాబూ? అనుకుంటూ ఈసురోమని బయలుదేరాను.

విచిత్రం ఏమిటంటే ఆ పనిచేసిన ఆదివారమే నాకు మేలు చేస్తుందని, అదే నన్ను గురువు దగ్గరకి దారి చూపెడుతుందని అనుకోలేదు. రోజు వెళ్ళే దారే అయినా ఎప్పుడూ వినపడని సరళీలు, జంటలు, పిల్లార గీతాలు, అలా ఒక దాని తరువాత ఒకటి

మురళీనాదంలా వినపడడానికి ఆ రోజు మాత్రమే జరిగే ప్రాక్టీస్ క్లాసే కారణం. అప్పటికే కొంత వరకు సంగీత ప్రవేశం ఉండడంతో నా మనస్సు కూడా అప్రయత్నంగా శ్రుతి కలుపుతోంది. ఆఫీసు పని ముగియగానే గురువుగారిని వెళ్ళి కలిసాను అతను నా అభిలాష అంతా విని "నేను త్యాగరాజ ఆరాధనోత్సవాలలో కించెం రద్దీగా ఉన్నాను. ఇలా నువ్వు చేరగానే నేను ఆ పని ఈ పని అని నీకు పాఠం చెప్పకుండా ఉండేందుకు నా మనసు అంగీకరించదు. అందుకని దయచేసి నువ్వు వచ్చే నెల కనపడు" అని చెప్పారు.

నా ఉత్సాహం మీద నీళ్ళు జల్లినట్లయింది. మళ్ళీ నెల ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడడమే అయింది. సరిగ్గా మళ్ళీ నెల వచ్చింది, నాకు వేరే ఊరికి పోస్టింగ్ వచ్చింది. రెండూ ఒకేసారి జరిగాయి. అంతే మరింత దూరం అయ్యాను. అలా నాలుగు నెలలు గడిచాయి. కాని ప్రాప్తం ఎవరు తప్పించగలరు. అందుకే మళ్ళీ వెళ్ళి కలిసాను.

"నమస్కారం గురువుగారు"

"ఎవరు"

"నేనండి విజయకుమార్ని అని ఇంతకుముందు జనవరిలో ఒకసారి..." అంటూ గుర్తుచేసే ప్రయత్నం చేశాను.

"ఆ అవునయ్యా.. అపుడూ వచ్చేనెల రమ్మన్నాను కదా. ఇప్పుడు వచ్చావేంటి?"

జరిగినదంతా వివరించి నా అభిలాష తెలిపాను. "సరే" అని శ్రుతి కలిపించి మర్నాటి నుంచీ రమ్మనడం జరిగింది.

సాధారణంగా చాలా మంది గురువుల వద్ద చూసాను. అంతకు ముందు ఎంతవరకు నేర్చుకున్నా మళ్ళీ కొత్త గురువు దగ్గర సరళీల నుంచి పాఠం మొదలు పెట్టాల్సిందే కానీ మా గురువుగారు మాత్రం "నేర్చుకున్నవే ఎన్నాళ్ళు నేర్చుకుంటావయ్యా..... కొత్తవి నేర్చుకో" అంటూ ప్రోత్సహించారు.

ఒకరోజు ఒక చోట కచేరి. ఎప్పుడూ కచేరి సమయానికి పావుగంట ముందరే ఉంటారు అంతే కానీ కచేరీ చేసే పాటగాణ్ణి నేనేకదా అని ఆలస్యంగా వెళ్ళడం ఎరుగరు. కానీ ఆ రోజు మృదంగం వయొలిన్ సహకార వాయిద్యాలు ఇంకా రాలేదు. సాధారణంగా పక్క వాయిద్యాలు వచ్చే దాక కచేరి ఎవరూ మొదలుపెట్టరు. కానీ ఇక్కడ విషయం ఏమిటంటే "శ్రుతి బాక్స్ ఉండనే ఉంది. లయకి మనచేతులు ఉన్నాయి. ఇక కచేరీ ఆగడమెందుకు?" అని సమయానికే మొదలెట్టేసారు. ఇలాంటి క్రమశిక్షణ పాఠాలకి ఎన్నిటికో మాకు రోల్‌మోడల్.

ప్రతి సంవత్సరం తమ విద్యార్థులనే కాక నేను వస్తాను, నాకూ రావాలని ఉంది అన్న ప్రతి ఒక్కరిని తిరవయ్యార్ త్యాగరాజ స్వామి ఆలయం సందర్శన బాధ్యత నెత్తిమీద వేసుకుంటారు.

గంటకి ఇంత! పాఠానికి ఎంత! అని లెక్కల్లో 'సరిగమలు' 'సరిసరి' అనిపించే ఈ వ్యాపార ధోరణి ప్రపంచంలో మా గురువు అలా కాదు అని చెప్పడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. తను నేర్పాలనుకున్న పాఠానికి రోజుకి 24 గంటలు కాదు ఆ పాఠం వచ్చేవరకు, ఆ సంగతి పలికే వరకు సూర్యుడు అస్తమించడు. చంద్రుడు ఉదయించడు. అలాగే తాళ క్రమం గతిలో పడేవరకు మా చేతులకి, ఆ సంగీత స్వర ఝరికి తాళమే ఉండదు.

వృత్తి రీత్యా ఉపాధ్యాయులు కావడంతో చదువుతో పాటు సంస్కారంకి కూడా పెద్ద పీట వేస్తారు గురువుగారు. 1953లో ఆకాశవాణి విజయవాడలో మరియు 1958 నుంచి ఆకాశవాణి హైదరాబాద్‌లలో కర్ణాటక సంగీత కళాకారులుగా పేరొందిన **శ్రీకొండపల్లి సీతారామాంజనేయ బాలకృష్ణశాస్త్రి** (మా గురువుగారు). మచిలీపట్నం వాస్తవ్యులైన శ్రీ కొండపల్లి సీతారామ ఆంజనేయులు మరియు కొండపల్లి కామేశ్వరశర్మ దంపతుల కుమారుడు. గురుకుల పద్ధతిలో "బ్రహ్మశ్రీ వేదమూర్తులైన హరినాగభూషణం"గారి వద్ద ఒక దశాబ్ద కాలంపాటు సంగీతాభ్యాసం సాగించిన గ్తరువాత "శ్రీ మంగళంపల్లి బాలమురళి కృష్ణ"గారి బాణీకి ఆకర్షితులై ప్రథమ గురువుగారి

అనుమతితో ఆయన వద్ద ఒక విశన్తి కాలంగా ఆయన అనుగ్రహం పొంది అతన్నే గురువుగా ఆరాధిస్తూ సంగీత క్షేత్రాన్ని సస్య శ్యామలం చేసే ప్రక్రియలో ప్రథమ విత్తుగా నిలిచిన ప్రశస్తుడు అని చెప్పవచ్చు.

అంతేకాదు ప్రతి సంవత్సరం "సప్తస్వర" వేదికగా చేసుకుని జరిపే త్యాగరాజ ఆరాధనోత్సవాలని, లేదా ఏదైనా సందర్భాన్ని పురస్కరించుకుని జరిపే కార్యక్రమాలలో తను ఎప్పుడూ పాడాలనుకోరు. మీరు పాడాలి ఎన్నాళ్ళు ఇలా తెర వెనకాలే ఉంటారు అంటూ ఔత్సాహికులకి, యువ కళాకారులకి అవకాశం ఇచ్చి పెద్ద పీట వేస్తారు. కానీ అదే తను తన గురువు దగ్గర విద్యాభ్యాసం సమయంలో మాత్రం మైక్ పెట్టుకు పాడవయ్య అని వాళ్ళ గురువుగారు అంటే "వద్దు గురువుగారు మైక్ పెట్టుకుంటే ప్రదర్శన మీదకి మనసు పోతుంది మీ బాణీపై మనసు ఉండదు" అని మనసంతా కూడా విద్య మీద లగ్నం చేసేవారు. అంతేకాదు తమ ఆదాయంలో ఇంచుమించు అంతా సంగీత సేవకి వినియోగిస్తూ తను అధ్యక్షుడై ఉన్న "సప్తస్వర" అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

అందుకే భాగ్యనగర వాసులంతా ఈ 'మహోన్నత శిఖరానికి, ఈ ఉత్తుంగ తరంగానికి' దేనితో కొలవాలో అన్న సందిగ్ధంతో "స ప స"లే సరి అనిపించి "స - సంగీత, ప - ప్రచార, స - సేవకా రత్న" అనే బిరుదుతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. గురువుగారిని అదే "స ప స"లకి నిర్వచనం అడిగితే స - సర్వం, ప - ప్రతిక్షణం, స - సంగీతం అంటారు. కానీ మా శిష్య వర్గాన్ని అడిగితే స - సంగీత లోక, ప - ప్రాగ్దశ్చిమాల, స - సార్వభౌముడు అంటాం.

స్వయానా బాల మురళిగారే తన స్వదస్తూరితో 'ఆత్మీయ అంతేయవాసి' అని ప్రశంసిస్తే ఎన్నో కోట్ల విలువగల ఆస్తి దక్కించుకున్న పేదవాడిలా ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవడం ఆయనకి గురువుపట్ల ఉన్న అంకిత భావానికి సూచన. అదే సంస్కారం అదే నిబద్ధత తను తమ విద్యార్థులందరి విషయంలో పాటిస్తారు.

శ్రీ శ్రీ ఇంకా ఈ నేలపై ఉంటే సాహితి క్షేత్రం ఇంకెంతగా సస్యశ్యామలం అయ్యుండేదో అని చలంగారు అన్నమాటలు ప్రతి ఒక్కరికి వర్తిస్తాయి అంటాన్నేను. అందుకే ఇటువంటి 'మా మంచి మాస్టారు' పంచభూతాలున్నంతవరకు ఆయురారోగ్యాలతో ఉండి సంగీత క్షేత్రాన్ని సస్యశ్యామలం చేయాలన్నది మా కోరిక ఎందుకంటే "యది దైవాత్ ఫలం నాస్తి ఛాయా కేన నివర్యతే" కదా!.

